క్లుప్తంగా

శ్రీవారి హుండీల ఆదాయం రూ.9 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్ర రావుపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో హుండీల ఆదాయం 47 రోజులకు రూ.9,00,626 లభించింది. సోమవారం దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు ఆధ్వర్యంలో ఈ ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ధర్మకర్తలు కొండల అరుణ కుమారి, తిప్పాని మణి, మహిళ, పురుష సేవకులు, శ్రీకృష్ణ సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని దక్షిణపు వీధి శ్రీ పెద్దమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం రామాంజనేయులు పర్యవేక్షించారు.

సాఫ్ట్‌వేర్ సంస్థతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒప్పందం



ఒప్పంద పత్రాలు అందుకుంటున్న ప్రిన్సిపాల్ గిరిబాబు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కంప్యూటర్ నైపుణ్యాలు, ఆటోకాడ్, ట్యాలీ, పైథాన్ వంటి సాంకేతిక కోర్సుల్లో శిక్షణ అందించేందుకు నగరంలోని సాఫ్ట్‌వేర్ సంస్థ ఓటీపీ టెక్నాలజీస్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నట్టు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.గిరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధుల నుంచి ఒప్పంద పత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.అజయ్ కుమార్, ఓటీపీ టెక్నాలజీస్ సంస్థ సీఈఓ జి.హరిబాబు పాల్గొన్నారు.

ఆళ్వార్‌లకు అభిషేకాలు



శ్రీవారి ఉత్సవ మూర్తులకు అభిషేకం చేస్తున్న అర్చకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్ర రావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి అధ్యయనోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆళ్వార్లకు విశేష అభిషేకాలు చేశారు. తొలుత స్వామి వారి ఉత్సవ మూర్తులకు, అనంతరం శ్రీ నమ్మాళ్వార్, శ్రీరామానుజులు, శ్రీ మణవాళ మహాముని ఆళ్వార్లకు పంచామృత అభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. మధురై నుంచి విచ్చేసిన కేకే బాలాజీ స్వామి ఆధ్వర్యంలో ద్రవిడ ప్రబంధ పారాయణ నిర్వహించారు. స్వామి వారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. అర్చకులు కిశాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు ప్రత్యేక పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

విద్యుత్ అకౌంట్స్ అధికారి బదిలీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు రూరల్ విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో అసిస్టెంట్ అకౌంట్స్ అధికారి జి.ఉష రాజమహేంద్రవరం సర్కిల్ కార్యాలయంలోని హెచ్‌టీ సెక్షన్‌లో అసిస్టెంట్ అకౌంట్స్ అధికారిగా బదిలీ అయ్యారు. ఈ మేరకు తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఉష స్థానానికి రాజమహేంద్రవరం సర్కిల్ కార్యాలయంలోని హెచ్‌టీ సెక్షన్‌లో పని చేస్తున్న టి.శ్రీదేవిని బదిలీ చేశారు.

సొంతింటి కల.. సాకారమైన వేళ



ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షిస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)



జాలిపూడిలో నిర్మించిన ఇళ్లు

- 2,848 ఇళ్ల నిర్మాణం పూర్తి
- నిర్మాణంలో 4,500 ఇళ్లు
- రూ.82.83 కోట్ల మంజూరు

ఏలూరు రూరల్ : వైఎస్సార్ సీపీ హయాంలో పేదల సొంతింటి కల సాకారమైంది. ఏలూరు రూరల్ గ్రామాల్లో 2,848 కుటుంబాలకు సొంతిల్లు ఏర్పడింది. మరో 4,500 కుటుంబాల ఇళ్ల నిర్మాణం కొనసాగుతోంది. ఇళ్ల నిర్మాణం నిమిత్తం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.82.83 కోట్లు మంజూరు చేశారు. మల్కాపురం, చాటపర్రు, మాదేపల్లి, జాలిపూడి, కాట్లంపూడి, శ్రీపర్రు, మానూరు, కోటేశ్వరదుర్గాపురం, గుడివాకలంక, మొండికోడు, ప్రత్తికోళ్లలంక, కొక్కిరాయిలంక, పైడిచింతపాడు, కోమటిలంక గ్రామాల్లో అర్హత గల పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మించుకున్నారు.

డీబీటీ రూపంలో రూ.12.77 కోట్లు

ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు అనుకూలంగా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) రూపంలో లబ్ధిదారుల ఖాతాల్లో రూ.12,77,81,488 జమచేసింది. ఒక్కో లబ్ధిదారుడికి రూ.1.80 లక్షలు మంజూరు చేసింది. ఇందులో రూ.1,28,310 నగదు రూపంలో, 90 సిమెంట్ బస్తాలు, ఐరన్, ఇసుక రూపంలో రూ 21,690, ఉపాధి హామీ పథకం ద్వారా రోజుకు రూ.200 చొప్పున 90 రోజులు వేతనం రూపంలో రూ.21,690 మంజూరు చేస్తోంది. మిగిలిన రూ.12 వేలు మరుగుదొడ్డి కోసం నగదు రూపంలో అందించనుంది. ఈ మొత్తం నాలుగు దశలో అందిస్తోంది.

నాన్ డీబీటీ : జగనన్నకాలనీ ఏర్పాటు కోసం ప్రభుత్వం రూ.7,05,98,000తో భూమి కొనుగోలు చేసింది. స్థలాలుగా విభజించి లబ్ధిదారులకు అందించింది. ఈ మొత్తాన్ని నాన్ డీబీటీగా పేర్కొంది.

సంతోషంగా ఉంది



జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నా కల నెరవేరింది. నేను పిల్లాపాపలతో హాయిగా ఉంటున్నాను. సుమారు రూ.8 లక్షల విలువ చేసే స్థలం ఇచ్చారు. ఇల్లు కట్టుకునేందుకు రూ.1.80 లక్షలు మంజూరు చేశారు. గత ప్రభుత్వంలో మాదిరి నేను ఏ అధికారి, నాయకుడు దగ్గరకు వెళ్లలేదు. నేరుగా వాలంటీర్ నాకు ఇంటి పట్టా ఇప్పించాడు. నిధులు మంజూరు చేయించాడు. నాకు చాలా సంతోషంగా ఉంది.

– కె.సత్యవతి, శనివారపుపేట

కొల్లేరు ప్రజల కల నెరవేరింది



గత ప్రభుత్వ హయాంలో కొల్లేరు ప్రజలు గట్లపై గుడెసెలు వేసుకుని బిక్కు బిక్కుమంటూ జీవించారు. నేడు వైఎస్సార్ సీపీ హయాంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో భూ సేకరణ జరిగింది. ప్రభుత్వం కోట్ల రూపాయలు విడుదల చేసి, వర్షాలు, వరదల సమయంలో ముంపుబారిన పడకుండా సేకరించిన భూమిని మెరక చేయించారు. ఇప్పుడు కొల్లేరు ప్రజలు ఇల్లు కట్టుకుని సంతోషంగా జీవిస్తున్నారు.

– పెన్మెత్స శ్రీనివాసరాజు, ఎంపీపీ

చేయాలనే తపనే విజేతల ప్రథమ లక్ష్యం



సదస్సులో మాట్లాడుతున్న రోటరీక్లబ్ ప్రతినిధి ఎంసీ దాస్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏ లక్ష్యాన్ని అయినా సాధించే విజేతల ప్రథమ లక్ష్యం చేయాలనే తపనే అని రోటరీక్లబ్ మాజీ జిల్లా గవర్నర్ ఎంసీ దాస్ అన్నారు. స్థానిక సీఆర్‌ఆర్ మహిళా కళాశాల సైకాలజీ కౌన్సిలింగ్ సెల్, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మోటివేషన్ కీ ఫర్ సక్సెస్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్ మాట్లాడుతూ పూజించబడే వాటినే పూజించాలని, మంచివారిని మంచి అనాలని, చెడ్డవారిని ఏమీ అనవద్దని సూచించారు. మంచి విషయాలకు మాత్రమే సెల్‌ఫోన్ వాడాలని, ఆరోగ్యకరమైన అలవాట్లు చేసుకోవాలని, కుటుంబంతో సత్సంబంధాలు కలిగి ఉండాలని అన్నారు. ఆలోచనల్లో సానుకూల దృక్పథం ఉండాలని, జీవితంలో కష్టాలు రోజూ ఉండవని, మంచిరోజు కోసం ఎదురుచూడాలని, నిజాయితీగా ఉంటూ చెప్పింది చేయాలని, చేసేదే చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు నేలపాటి రోహిత్, గుడిపాటి లలిత, కళాశాల ప్రిన్సిపాల్ పి.శైలజ, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థినికి ట్యాబ్ అందిస్తున్న దిరిశాల ప్రసాద్, రాము

ఏలూరు రూరల్ : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు టాబ్స్ వల్ల భవిష్యత్తులో టెక్నాలజీ రంగంలో రాణిస్తారని రాష్ట్ర మెడికల బోర్డు డైరెక్టర్ దిరిశాల ప్రసాద్ అన్నారు. మంగళవారం దక్షిణపువీధి ప్రభుత్వ పాఠశాలలో బాలబాలికలకు ఆయన ట్యాబ్స్ పంపిణీ చేశారు. కంప్యూటర్ కోర్సు ద్వారా మారుతోన్న టెక్నాలజీపై విద్యార్థులకు మరింత అవగాహన పెరుగుతుందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ.వేలు ఖరీదైన ట్యాబ్స్ ఉచితంగా అందిస్తున్నారని కొనియాడారు. ఉన్నత వర్గాల పిల్లలతో సమానంగా పేద విద్యార్థులు పోటీ పడాలంటే కంప్యూటర్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమయ్యాయని కార్పొరేటర్ తంగెళ్ల రాము అన్నారు. నాడు నేడు నిధులతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించిన జగన్ సేవలు మరువరాదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

16న సమ్మెను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోపి

ఏలూరు (టూటౌన్): ఈ నెల 16న కార్మిక సంఘాల పిలుపుమేరకు నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి పిలుపు నిచ్చారు. సీఐటీయూ స్థానిక జిల్లా కార్యాలయంలో వివిధ కార్మిక సంఘాలతో మంగళవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నిరంకుశ హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. ఏదైనా ప్రమాదం జరిగితే డ్రైవర్లను బాధ్యులను చేయడం సరికాదని, మానవ తప్పిదాల వల్ల జరిగే ప్రమాదాలు 10 శాతం మాత్రమేనని వివరించారు. ప్రముఖ ప్రొఫెసర్ గీతం తివారీ ఐఐటీ ఢిల్లీలో రోడ్డు ప్రమాదాలపై అధ్యయనం చేసి మానవేతర కారణాల వల్ల 90 శాతం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్టు రుజువు చేశారని తెలిపారు. జీడీపీలో 4.5 శాతం వాటా గల రవాణా రంగ కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వం ఎటువంటి రక్షణ లేదా ప్రోత్సాహకం అందించడం లేదని విమర్శించారు. రవాణా రంగంలో పనిచేసే కార్మికులందరికీ కేంద్ర ప్రభుత్వమే సమగ్ర సంక్షేమ చట్టం తీసుకురావాలని కోరారు. చక్రాల అమర్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ సమావేశంలో సీఐటీయూ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ సుందరయ్య, ఏలూరు ఆటోనగర్ అధ్యక్షులు అరుణతార నాగేశ్వరరావు, పొలిమెట్ల కరుణాకర్, బుద్ధ నాగ సూర్యబాబు, మెరుగు రాఘవ తదితరులు పాల్గొన్నారు.

11న జాతీయ తెలుగు సాహిత్య సదస్సు



సదస్సు కరపత్రం విడుదల చేసిన అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవాసంస్థ శ్రీశ్రీ కళా వేదిక ప్రతి నెలా సాహితీ ప్రభంజనంలో భాగంగా ఈ నెల 11న కొయ్యలగూడెంలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో జాతీయ తెలుగు సాహిత్య సదస్సు, జాతీయ కవి సమ్మేళనం నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రం రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి విడుదల చేశారని శ్రీశ్రీకళా వేదిక ఏలూరు జిల్లా అధ్యక్షుడు శ్రీహరికోటి పేర్కొన్నారు. తెలుగు భాషాభిమానులంతా ఈ కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొల్లి రామావతి, శొంఠియాల కస్తూరిరావు, ఎంజే సుజయ్ కృష్ణ, గోరింక ఐజక్, శ్యామల హరికోటి, పచ్చా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మూడు అంగుళాల చెక్క రామాలయం



దొర శివప్రసాద్, సూక్ష్మ కళాకారుడు, ఏలూరు



చెక్కతో అయోధ్య రామాలయం నిర్మించిన దృశ్యం

ఏలూరు (టూటౌన్): మూడు అంగుళాల సైజులో చెక్కతో అయోధ్య రామాలయాన్ని నిర్మించి అబ్బురపరించారు ఏలూరుకు చెందిన సూక్ష్మ కళాకారుడు దొర శివప్రసాద్. గత నెల 22న అయోధ్యలోని బాల రాముని విగ్రహానికి ప్రధాని మోదీ ప్రాణ ప్రతిష్ఠ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తనదైన శైలిలో చెక్కతో రామాలయ రూపాన్ని చిత్రీకరించిన శివ ప్రసాద్‌ను పలువురు అభినందిస్తున్నారు.

పేదల ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యం



వృద్ధునికి వైద్య పరీక్ష చేస్తున్న సిబ్బంది

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల ఆరోగ్యమే ధ్యేయంగా పనిచేస్తోందని కోటేశ్వరదుర్గాపురం సర్పంచ్ వర్రి లక్ష్మీదుర్గ కొనియాడారు. మంగళవారం కోటేశ్వరదుర్గాపురం గ్రామంలో అధికారులు ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ హయాంలో పేదల ఇంటి వద్దకే వైద్య సిబ్బంది వచ్చి సేవలు అందించడం ఓ చరిత్రని కొనియాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ సేవల పరిధిని రూ.25 లక్షలకు పెంచారని వైఎస్సార్ సీపీ నాయకుడు వర్రి నారాయణ కొనియాడారు. అనంతరం గుడివాకలంక, చాటపర్రు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.ప్రణవి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలైన విద్యార్థినులకు బహుమతి అందిస్తున్న ఉపాధ్యాయిని

ఏలూరు రూరల్: గ్రామాలు, పట్టణాల్లో బాలబాలికలకు స్నేహపూర్వక వాతావరణ కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ పి.సుమంజలి అన్నారు. మంగళవారం చాటపర్రు జెడ్పీ పాఠశాలలో బాలమేళా కార్యక్రమం నిర్వహించారు. బాలబాలికల్లో ఉత్సాహం, ఆటలపై ఆసక్తి పెంచేందుకు పోటీలు నిర్వహిస్తున్నామని సుమంజలి తెలిపారు. సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తున్నామని చెప్పారు. ఈ పోటీల వల్ల పిల్లల్లో దాగిఉన్న ప్రతిభ, పాఠవాలు వెలుగులోకి వస్తాయన్నారు. పిల్లల్లో నమ్మకం, విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు హెచ్‌ఎం విజయకుమారి తదితరులు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

జాతీయ స్థాయి పోటీలకు కళాశాల క్రీడాకారులు

భీమడోలు: పోలసానిపల్లి బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల స్పోర్ట్స్ కళాశాలలోని ముగ్గురు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కళాశాలలోని కె.కావ్య, వై.యశస్విని, జే.పల్లవీ చక్కని ప్రతిభను చాటారు. కృష్ణా జిల్లా ఉయ్యూరులో గత నెల 30న నిర్వహించిన 19వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ మీట్ పోటీలు నిర్వహించారు. కళాశాలోని అండర్ 14 విభాగంలో కె.కావ్య 60 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, హైజంప్‌లో అదే విధంగా వై.యశస్విని 60 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, హైజంప్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను చూపారు. అండర్ 16 విభాగంలో జే.పల్లవి 600 మీటర్ల పరుగులో సత్తా చాటింది. వివిధ విభాగాల్లో క్రీడా ప్రతిభను చాటిన ముగ్గురిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసారని ప్రిన్సిపల్ రమణ, కోచ్ జి.కృష్ణకుమారి మంగళవారం రాత్రి తెలిపారు. ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు గుజరాత్ నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ కృష్ణకుమారి తెలిపారు.

వైకల్యం నివారణపై అవగాహన సదస్సు

దెందులూరు: వైకల్యం అనేది గర్భస్థ సమయంలో, ప్రసవం సమయంలో లేదా మేనరిక వివాహాలు చేసుకోవడం వల్ల కూడా సంభవిస్తుందని డాక్టర్ బి.రాకేష్ అన్నారు. మంగళవారం దెందులూరు సచివాలయంలో ఉమా ఎడ్యుకేషన్ టెక్నికల్ సొసైటీ దొండపాడు ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో రాకేష్ మాట్లాడారు. తగు జాగ్రత్తలు తీసుకోవడంతో వైకల్యాన్ని అరికట్టవచ్చన్నారు. సంస్థ కోఆర్డినేటర్ డీ.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా దివ్యాంగులకు అవసరమైన ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ, ఆడియోలజీ, కృత్రిమ అవయవాలు తదితర సేవలు అందిస్తున్నామన్నారు. దివ్యాంగులు ఈ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. గ్రామ కార్యదర్శి వీఎస్ చౌదరి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం ఉమా ఎడ్యుకేషన్ టెక్నికల్ సొసైటీ సేవలను అభినందించారు. సచివాలయ, దివ్యాంగుల పునరావాస సిబ్బంది, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

22, 23 తేదీల్లో సాయ్ సెంటర్ ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్: ఈ నెల 22, 23 తేదీల్లో ఏలూరు సాయ్ సెంటర్ 2024–25 ఏడాది ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు సెంటర్ ఇన్‌చార్జి డీఎస్‌వీ వినాయక్ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్ విభాగంలో బాలబాలికలు, వెయిట్ లిఫ్టింగ్‌లో బాలికలు మాత్రమే పాల్గొనాలని పేర్కొన్నారు. 12 ఏళ్ల నుంచి 18 ఏళ్ల మధ్య వయస్సు గల వారు ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వయస్సు ధ్రువీకరణ పత్రం (10వ తరగతి మార్క్ లిస్ట్, తహసీల్దార్ జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్), మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఒరిజినల్ ఆధార్ కార్డుతో 22వ తేదీ ఉదయం 7 గంటలకు సాయ్ సెంటర్ ఇన్‌చార్జికు రిపోర్ట్ చేయాలని సూచించారు.

జయశ్రీ రాఘవ్‌కు అవార్డు



అవార్డుకు ఎంపికైన జయశ్రీ రాఘవ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం దక్షిణ భారత అధ్యక్షురాలు కొరిపల్లి జయశ్రీ రాఘవ్ ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వ్యామ్) అపరాజిత సూపర్ స్టార్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆర్యవైశ్య మహిళలకు ఆమె అందిస్తున్న సేవలు, గత తొమ్మిదేళ్లుగా సంఘం ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలకు గుర్తుగా ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్టు వ్యామ్ గ్లోబల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సి.జ్యోతి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జయశ్రీ రాఘవ్‌కు ఈ అవార్డును ఈ నెల 10న చెన్నైలో నిర్వహించే వ్యామ్ నేషనల్ ఉమెన్స్ గ్లోబల్ కాన్ఫరెన్స్‌లో అందజేయనున్నారు. ఈ సందర్భంగా ఆమెకు నగరానికి చెందిన ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

పౌష్టికాహారం పంపిణీ

ఏలూరు రూరల్: ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం మహిళ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు క్రీడాకారులకు మంగళవారం పౌష్టికాహారం పంపిణీ చేపట్టారు. స్థానిక స్పోర్ట్స్ హాస్టల్‌లో శిక్షణ పొందుతున్న బాలబాలికలకు పలు రకాలు పిండి వంటకాలను అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షురాలు కర్రి అరుణ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పిల్లలు జంక్ ఫుడ్ తీసుకుంటున్నారని తెలిపారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే జంక్‌ఫుడ్ వదిలి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి మేరీ మాణిక్యం, ట్రెజరరీ రామ్ సత్యవతి, పద్మావతి, శ్రీలక్ష్మి, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	38
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	45
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	37
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	16.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34

మహిళా సాధికారతే లక్ష్యం

భీమడోలు: మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పారదర్శక పాలన అందిస్తున్నారని ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాల్గవ విడత ఆసరా సంబరాల్లో డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు మంగళవారం డ్వాక్రా రుణమాఫీ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ పాము సునీత అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గాంధీజీ, అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. దేశ చరిత్రలోనే కుల, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలను అందిస్తూ వారి కుటుంబాలకు భరోసా కల్పిస్తున్న ఏకైక సీఎం జగనన్న అన్నారు. ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ పేదల జీవితాలు బాగుండాలన్నదే సీఎం జగనన్న లక్ష్యమన్నారు. వచ్చే ఎన్నికలు పెత్తందార్లు, పేదలకు మధ్య జరిగే యుద్ధమని, తాము ఎన్నడూ పేదల వైపే ఉంటూ మంచికి నిలబడతామన్నారు. ఈ యుద్ధంలో జగనన్నను గెలిపించేందుకు మనమంతా సిద్ధం కావాలని కోరారు. సంక్షేమ పాలన ద్వారా దేశంలో ఏపీ అన్ని రంగాల్లో ముందంజలో ఉందన్నారు. జగనన్న పాలనలో 124 సార్లు బటన్ నొక్కి రాష్ట్రంలో రూ.2.65 లక్షల కోట్లను వివక్ష లేకుండా పారదర్శకంగా నేరుగా డీబీటీ ద్వారా పేద లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చి సర్కారీ బడుల్లో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తోందన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆలోచించే మహోన్నత వ్యక్తి సీఎం జగనన్న అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో రెండు బటన్లు వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు వేసి గెలిపించాలన్నారు. జిల్లా బీసీ సెల్ కన్వీనర్ ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు 640 ఎన్నికల హామీలిచ్చి గెలిచిన తర్వాత బుట్టదాఖలు చేసిన ఘనుడన్నారు. ఆయన ఎన్ని హామీలిచ్చినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. భీమడోలు, పోలసానిపల్లి, అంబర్‌పేట, సూరప్పగూడంలోని డ్వాక్రా చెల్లెమ్మలకు రూ.20 కోట్ల విలువ గల రుణమాఫీ చెక్కును పద్మశ్రీ, వాసుబాబు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ, జిల్లా బీసీ సెల్ కన్వీనర్ ఘంటా ప్రసాదరావు, మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ, సర్పంచ్ వెజ్జు బాలాజీ, ఉపసర్పంచ్ ఇనపాల సాయి, జిల్లా కార్యవర్గ సభ్యుడు తుమ్మగుంట రంగ, మండల సాగు సలహా మండలి చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.